క్లుప్తంగా

సీఎస్ఐ చర్చిలో సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రైస్తవ మతపెద్దల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రైస్తవులు, మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. కేవలం ఓటు బ్యాంకుగా వాడుకోవడమే తప్పా తమ సంక్షేమానికి కృషి చేయడం లేదని విమర్శించారు. క్రైస్తవుల ఆస్తులకు, పాస్టర్స్‌కు భద్రత లేకుండా పోయిందని వాపోయారు. సమావేశంలో తాలుకా అధ్యక్షుడు ఎండీ విల్‌ఫ్రెండ్, ఉపాధ్యక్షుడు కె.యేసు కుమార్, ప్రకాశం, మోజస్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


శిశువుతో 108 సిబ్బంది

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం నిండు గర్భిణి 108లో ప్రసవించింది. రెబ్బెన మండలంలోని బొరగుట్ట గ్రామానికి చెందిన హస్మాబేగం గర్భిణి. కౌటాల మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఆదివారం ఓ శుభకార్యానికి వచ్చింది. ఈ క్రమంలో పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని కౌటాల పీహెచ్‌సీకి తరలించినట్లు ఈఎంటీ పిట్టల విజయ్, పైలెట్ ఆసిఫ్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


పరిశీలిస్తున్న డీసీఎస్‌వో

దహెగాం: మండల కేంద్రంతో పాటు, లగ్గాం, ఒడ్డుగూడ కుంచవెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం డీసీఎస్‌వో తారామణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆమె వెంట సీఈవో బక్కయ్య, డీటీ శ్యాంలాల్, జీవన్, సాయి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


హోమం నిర్వహిస్తున్న పండితులు

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివపంచాయతన నవగ్రహ సహిత భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. ఆదివారం వేదపండితులు సువర్ణం పార్థివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలను సమీపంలోని పెద్ద వాగుకు తీసుకెళ్లి జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండుటెండల్లో.. మాడే కడుపులతో..


ఘాటువద్ద వానరులు

కెరమెరి: ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో అడవులు ఆకురాలి మోడువారుతున్నాయి. అడవిలో తినేందుకు ఏమిలేక కోతులు అలమటిస్తున్నాయి. ఎవరైనా రోడ్డుపై వెళ్లేవారు ఏమైనా వేస్తే గుంపులుగా చేరుకుని తింటూ అర్ధ కాలితో ఉంటున్నాయి మండలంలోని కెరమెరి ఘాట్‌పై వానరులు. ఘాట్ మొత్తం 9కిలో మీటర్లు ఉండగా సుమారు 5కిలో మీటర్ల పొడవునా దీనంగా కోతులు కనిపిస్తున్నాయి.

ఉప ఎన్నికలు జరిగేనా..?

- నర్పంచులు లేక అధికారులపై భారం
- అభివృద్ధికి నోచని గ్రామాలు


చింతలమానెపల్లిలో రోడ్డుపై గుంతలో నిలిచిన మురుగు

చింతలమానెపల్లి: ప్రజాప్రతినిధులు లేక.. అభివృద్ధి కొరవడుతోంది.. ప్రజాసమస్యల పరిష్కారంలో జాప్యం నెలకొంటోంది. ప్రభుత్వానికి, పాలనా యంత్రాంగానికి అనుసంధానం అయినా ప్రజాప్రతినిధులు లేనిలోటు ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రభావం చూపిస్తోంది.

చింతలమానెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 2011 లెక్కల ప్రకారం 2945 జనాభా కలిగి ఉంది. ఈ గ్రామ పంచాయతీ నోటిఫైడ్ ఏజెన్సీ గ్రామం కాగా రికార్డుల ప్రకారం 2945 జనాభా ఉన్నప్పటికీ మరో 1000 మంది అదనంగా నివసిస్తున్నారు. 10వ వార్డు సభ్యులు ఒక సర్పంచ్ స్థానానికి ఎన్నిక జరిగింది. ఇక్కడ ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో తాము చేసిన ఖర్చులను నిబంధనల ప్రకారం ఎన్నికల సంఘానికి వివరాలతో అందించకపోవడంతో గ్రామ సర్పంచ్ సహా 10మంది వార్డు సభ్యులపై అనర్హత వేటు వేస్తూ రెండేళ్ల క్రితం ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించ లేదు. ప్రజాప్రతినిధులు లేక అధికారులపై అదనపు భారంతో గ్రామ పంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

చింతలమానెపల్లి మండలంలోని అడెపెల్లి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. గ్రామస్తులంతా కలిసి నూతన సర్పంచ్‌గా అన్నం చీకటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనారోగ్యంతో సర్పంచ్ అన్నం చీకటి మృతి చెందగా ఇక్కడ సర్పంచ్ స్థానం ఖాళీగా ఉంది. నోటిఫైడ్ గ్రామపంచాయతీ అయిన అడెపెల్లిలో ఉప సర్పంచ్‌గా ఎంపికైన అతికం సంతోష్‌గౌడ్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైనందున గ్రామ పంచాయతీకి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ప్రోత్సాహకం నేటికీ అందలేదు.

జిల్లాలో 15 మండలాలు ఉండగా ఆయా మండలాల్లో మొత్తంగా 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా మండలాల్లో గత ఎన్నికల్లో గెలుపొంది సరైన వివరాలు సమర్పించని అభ్యర్థులపై రాష్ట్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. మరి కొన్ని స్థానాలలో సర్పంచ్‌లు లేదా ఎంపీటీసీలు మరణించడం, వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేయడంతో ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 12 సర్పంచ్ స్థానాలు, 5 ఎంపీటీసీ స్థానాలు, 520 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి జైనూర్ మండలంలో ఒక స్థానం, వాంకిడిలో ఒకటి, కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) ఎంపీటిసి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. సర్పంచ్ స్థానాలలో ఆసిఫాబాద్ మండలంలో 3, చింతలమానెపల్లి 2, కెరమెరి 2, తిర్యాణి 1, వాంకిడి 1, రెబ్బెన1, కాగజ్‌నగర్1, పెంచికల్‌పేట్1 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

కుంటుపడుతున్న అభివృద్ధి...

ప్రజాస్వామ్యంలో కీలకమైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆయా గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రజలకు అధికార యంత్రాంగానికి వారధిగా ఉండే ప్రజాప్రతినిధులు లేక ప్రజల సమస్యలు పరిష్కారించడంలో జాప్యం నెలకొంది. గ్రామాల్లో ఆయా అంశాలపై అధికారులు, సర్పంచుల ద్వారా ప్రజలతో మమేకమయ్యేవారు. సర్పంచులు లేనిచోట అభివృద్ధి కుంటుపడుతోంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు...

ఆయా మండలాల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాల్లో ఎక్కువగా రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న చర్యల కారణంగా ఖాళీగా ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అందించాల్సి ఉంటుంది. కానీ గెలుపొందిన అభ్యర్థులు ఈ వివరాలను ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం సమర్పించని కారణంగా జిల్లా వ్యాప్తంగా గెలుపొంది ఎన్నికల ఖర్చు సమర్పించని వారిపై అనర్హత వేటు వేసింది.

పంచాయతీల ఉప ఎన్నికలు అనుమానమే..?

2019లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. పదవీ కాలంలో నాలుగు సంవత్సరాల కాలం పూర్తి కావాల్సిన వస్తోంది. ఖాళీ అయిన స్థానాలలో ఆరు నెలల లోపు ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాలి. 2022లో ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పంచాయతీలలో ఓటరు జాబితాలు సైతం అందుబాటులో ఉంచారు. కానీ ఎన్నికలు మాత్రం నిర్వహించ లేదు. కాగా సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించినా పదవీకాలం సంవత్సరం లోపే ఉండడంతో ఎన్నికలు నిర్వహించేది అనుమానంగా మారింది.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్‌: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 10వ వార్డు శ్రీరాంనగర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త పాశం గోపాల్ ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ ద్వారా మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలుస్తున్నారని అన్నారు. మృతిచెందిన కార్యకర్త కుటుంబీకులు రోడ్డున పడకుండా బీమా చెక్కును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ వనమాల విజయ రాము, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా


కుంచవెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

- మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని ఆరోపణ
- ఇరవై రోజులైనా కొనుగోలు చేస్తలేరని రైతుల ఆవేదన
- న్యాయం చేయాలని వేడుకోలు

దహెగాం: రైతులు పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇన్ని అవస్థలా అని మండలంలోని కుంచవెల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెట్టి ఇరవై రోజులు దాటినా, వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ ఆందోళన చేశారు. మండలంలోని కుంచవెల్లి గ్రామరైతులు వరి కొనుగోలు కేంద్రం వద్ద ఆదివారం మధ్యాహ్నం ఎండలోనే ధాన్యం కుప్పల వద్ద ధర్నా చేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ.. వరి కోతలై నెల రోజులు అవుతోంది. ఇప్పటివరకు కేవలం రెండు లారీల లోడ్లు మాత్రమే పోయాయి. మిగితా వడ్లను కొనుగోలు చేయడంలేదని వాపోతున్నారు. వడ్లు బాగా లేవని మిల్లర్లు ఇష్టం వచ్చినట్లు క్వింటాలుకు 5 నుంచి 10కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. కోత విధించడానికి రైతులు ఒప్పుకుంటేనే ధాన్యం కొనుగోలు చేస్తారా అని మండిపడుతున్నారు. వ్యవసాయాధికారులు వచ్చి వడ్లను పరిశీలించినా మిల్లర్లు చెప్పిందే వేదంగా నడుస్తుందన్నారు. ఆరబెట్టాలని చెబితే ఆరబెట్టాం, తూర్పాల పట్టుమంటే పట్టినం, మరి ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మట్టి పెల్లలు, పచ్చ గింజలు, తాలు ఉందంటూ మిల్లర్లు కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరారు. విషయం తెలుసుకున్న డీసీఎస్‌వో రాజామణి కొను గోలు కేంద్రానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారులు వచ్చి పరిశీలించిన వాటిని ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని రైతులకు సూచించారు. దీంతో మిల్లర్లు కోత విధించకుండా చూడాలని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా నాణ్యమైన ధాన్యం ఉంటే మద్దతు ధర లభిస్తుందని సూచించారు. సీఈవో బక్కయ్య, రైతులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కెరమెరి/కౌటాల: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉపాధి శిక్షణ సంస్థ కేబీ ఉట్నూర్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ కుమురం లక్ష్మణ్ తెలిపారు. ఫొటోగ్రఫీ, రేడియోగ్రఫీ, సెల్ రిపేరింగ్, ఏసీ మరమ్మతులు, హౌస్ వైరింగ్, టూవిల్లర్ మరమ్మతులు, బ్యూటీపార్లర్, మగ్గంవర్క్, కుట్టు మిషన్ శిక్షణ కోసం ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువత జూన్ 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 08731 293114, 99494 12159, 89856 33226 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

గుండి ప్రభుత్వ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

ఆసిఫాబాద్‌: మండలంలోని గుండి ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్ ఆదివారం హైదరాబాద్‌లో అదనపు సంచాలకులు లింగయ్యకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో 8, 9 తరగతులు ఉన్నతీకరించాలని కోరారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ నాయకులు జాబరి రవీందర్ ఉన్నారు.

నిండా నిర్లక్ష్యం.. పనుల్లో జాప్యం

- నిలిచిన వంతెనల నిర్మాణ పనులు
- ఏళ్లు గడుస్తున్నా ఎక్కడిపనులు అక్కడే?
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


అసంపూర్తిగా లక్మాపూర్ వాగుపై వంతెన

కెరమెరి: గుత్తేదారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. మండలంలోని లక్మాపూర్, అనార్‌పల్లి వాగులపై చేపడుతున్న వంతెనల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడం, సంవత్సరాల తరబడి పనులు నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.


పిల్లర్ దశలో అనార్‌పల్లి వంతెన


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

ప్రారంభించి ఎనిమిదేళ్లు..

మండలంలోని లక్మాపూర్ వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను 2015సంవత్సరంలో రూ.3 కోట్ల నిధులతో ప్రారంభించగా ప్రస్తుతం పిల్లర్ల దశలోనే ఉంది. పిల్లర్లు నిర్మించి కూడా ఐదేళ్లు గడుస్తుండగా, ఇతర పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. దీంతో వంతెన పక్కనే తాత్కాలిక మట్టి రోడ్డుపై ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు.

నత్తనడకన పనులు

మండలంలోని అనార్‌పల్లి వాగుపై 2016సంవత్సరంలో రూ.5కోట్ల నిధులతో ప్రారంభమైన వంతెన పనులు 2018లో పూర్తి కావాల్సి ఉంది. కానీ పిలర్లు దాటడం లేదు. ఈ వాగుపై నుంచి కరంజీవాడ, బోరిలాల్‌గూడ, జన్కాపూర్, ఇంద్రానగర్, అంతాపూర్, నారాయణ గూడ గ్రామాలకు వెళ్లొచ్చు. పనులు వేగంగా కొనసాగకపోవడంతో ఈ ఏడాది కూడా ఆ ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి.

కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం



అనార్‌పల్లి వంతెన నిర్మాణం చేపట్టిన గుత్తేదారును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాం. ఆయన నిర్వాకం వల్లే పనులు నిలిచిపోయాయి. వచ్చే ఏడాది పనులు ప్రారంభిస్తాం. నిధులు పెంచి నివేధిక అందిస్తాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం.

– స్టీవెన్, పీఆర్ఏఈ, కెరమెరి

పనులు త్వరగా పూర్తిచేయాలి



గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చాలా ఇబ్బంది అవుతోంది. వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి. అధికారులు వచ్చి చూసి పోతున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు.

– రాథోడ్ సుదర్శన్, లక్మాపూర్

సేవా కార్యక్రమాలు అభినందనీయం


ప్రజలకు మజ్జిగ అందజేస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌టౌన్‌: న్యూట్రిషన్ ప్లస్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ ఏరియాలో 500 లీటర్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో టౌన్ సీఐ బుద్దేస్వామితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటి ఎండలు మండుతున్న క్రమంలో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూట్రిషన్ ప్లస్ నిర్వాహకుడు డాక్టర్ సుమిత్, సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలి


కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్‌: ఎయిడ్స్ నివారణకు అందరూ కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్‌ను అంతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో జిల్లా 30వ స్థానంలో ఉందని, జిల్లాలో 2008 నుంచి 2024 వరకు 154098 మంది స్వచ్ఛందంగా పరీక్షలు నిర్వహించగా 678 మందికి హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు


విగ్రహం ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్‌: సమసమాజ స్థాపనలో అంబేద్కర్ కృషి ఆదర్శప్రాయమని జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ మతానికి చెందిన వ్యక్తి కాదని, సమాజ హితం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదన్నారు. నియోజకవర్గంలో 77 యూనిట్ల దళితబంధు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, బాపు, కేశవరావు, సాంబయ్య పాల్గొన్నారు.

ఎస్పీఎం ఆధ్వర్యంలో 6కే రన్


పరుగును ప్రారంభిస్తున్న మిశ్రా

కాగజ్‌నగర్‌టౌన్‌: ప్రపంచ పర్యవరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీఎం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 6కే రన్ పరుగును ఎస్పీఎం ఉపాధ్యక్షుడు మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజ్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సతీశ్‌సింగ్, సెఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సీజీఎం సురేందర్ బిహాని, ఎస్పీఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

అడవితల్లి గీసిన చిత్రం


మైదాన ప్రాంతంలో చెట్ల నీడలు

చింతలమానెపల్లి: మానవాళి మనుగడకు ప్రకృతే కారణం.. ప్రకృతికి మనమేదైనా ఇస్తే అంతకన్నా ఎక్కువగా మనకే తిరిగి ఇస్తుందని పెద్దలు అంటుంటారు. ప్రకృతి రక్షణలో కీలకమైన అడవులు అందుకు నిదర్శనం. అడవులపై ప్రేమను చూపిస్తే అంతకన్నా ఎక్కువ ఆనందాన్ని మనకు అందిస్తాయి. ఇలాంటి ఆనందాన్ని ఆశ్చర్యాన్ని కలిగించే దృశ్యాలు ప్రకృతిలో ఎన్నో ఉన్నాయి. మండలంలోని ఖర్జెల్లి అటవీ ప్రాంతంలో దిందా సమీపంలో మైదాన ప్రాంతాలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి పచ్చగా మారగా సూర్యుడు ఏటవాలుగా ఉన్న సమయంలో వృక్షాల నీడలు పచ్చని మైదానంలో పొడవుగా అడవితల్లి గీసిన ఛాయా చిత్రంలా కనిపించాయి.